# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో జలజీవన్ మిషన్‌ను సమర్ధవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి నేరుగా వెళ్ళే విమానసేవలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి.**
3. **స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు విజయవాడలో ఆవిష్కరిస్తారు.**
4. **నైపుణ్య గణనను పూర్తి చేసేందుకు జిల్లాల సంయుక్త కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**
5. **రాష్ట్రంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయి.**

==========================

రాష్ట్రంలో ప్రతి ఇంటికి తాగు నీటిని అందించేలా జలజీవన్ మిషన్‌ను సమర్ధవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు రెండో రోజు కొనసాగుతోంది. సమావేశంలో భాగంగా పలు అంశాలపై జిల్లాల కలెక్టర్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,

వాయిస్ 36 సెకన్లు

---

రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి మరిన్ని పట్టణాలకు విమాన సేవలను విస్తరిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి నేరుగా విమానసేవలు ఈరోజు ప్రారంభమైయ్యాయి. తొలి విమాన సర్వీసులో ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందరేశ్వరి చేరుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని విమానాశ్రయాల నుంచి కొత్త సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం నూతన టెర్మినల్‌ను త్వరితగతిన పూర్తి చేస్తామని కేంద్రమంత్రి పేర్కొంటూ,

..వాయిస్..38 సెకన్లు

---------------------------

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు విజయవాడలో ఆవిష్కరిస్తారని రాష్ట్ర పన్నుల ముఖ్య కమిషనర్ ఎ. బాబు తెలిపారు. విజయవాడలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయవాడ ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ క్రీడా మైదానంలో నిర్వహించే స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం వాహనాల పార్కింగ్, భద్రత, విద్యుత్ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రవాణా, వైద్య శిబిరాలు వంటి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఈ తెల్లవారుజాము నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుమలలో భారీ వర్షం చలితీవ్రత ఒక్కసారిగా పెరగడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొండచరియలు విరిగేపడే ప్రమాదం ఉండడంతో పాపవినాశనం, శ్రీవారి పాదాలకు వెళ్లే మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. భారీ వర్షాల నేపథ్యంలో తిరుపతి నగరపాలకసంస్థ సంస్థ పరిధిలో హెల్ప్ లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కమిషనర్ ఎన్.మౌర్య పేర్కొంటూ,

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో నైపుణ్య గణనను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు జిల్లాల సంయుక్త కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంక్షేమ, గ్రామ, వార్డు సచివాలయాలు, పంచాయతీరాజ్, పురపాలక-పట్టణాభివృద్ధి, రెవెన్యూ, పౌరసంబంధాలు, ఇతర శాఖలకు చెందిన ఎన్యూమరేటర్ల ద్వారా గణన పూర్తి చూసేలా చర్యలు చెప్పట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త కలెక్టర్లను ఆదేశించింది. గణనలోని అన్ని అంశాల్లోనూ కలెక్టర్లు జిల్లా ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తారు.

---------------------------

రాష్ట్రంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయి. 'ఆరోగ్యకర, సంతృప్తికర తాగునీరు, పచ్చదనం- పరిశుభ్రత, సామాజిక భద్రత' విభాగాలకు గాను ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిన్న ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. 'ఆరోగ్యకర' విభాగంలో చిత్తూరు జిల్లా బొమ్మ సముద్రం గ్రామానికి, పచ్చదనం- పరిశుభ్రత విభాగంలో అనకాపల్లి జిల్లా తగరంపూడికి, సంతృప్తికర తాగునీరు విభాగంలో అనకాపల్లి జిల్లా న్యాయంపూడికి, సామాజిక భద్రత విభాగంలో ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్ల పంచాయతీలకు జాతీయ పురస్కారాలు లభించాయి.

---------------------------

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -2024 కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఎమ్. మోహన్ బాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న హ్యాకథాన్ కార్యక్రమాన్ని చిత్తూరులోని, శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు.. ఈ సందర్భంగా కళాశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ బాబు మాట్లాడుతూ,

... వాయిస్... 35 సెకన్లు

---------------------------

అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విదార్థులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో రేపు ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న మేళాలో 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ అర్హతగా కలిగిన యువత పాల్గొనవచ్చని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను ఝఅజూబఅఝఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

---------------------------

రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యామ్నాయంగా కేటాయించే ప్లాట్లకు ఈ రోజు 'ఈ-లాటరీ' నిర్వహిస్తున్నట్లు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ - సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో 'ఈ-లాటరీ' జరుగుతుందని తెలిపారు. అమరావతి ప్రాంతంలోని 14 గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్ లైన్ వ్యవస్థ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్టు తెలిపారు. నవులూరు, కురగల్లు, నిడమర్రు, రాయపూడి, లింగాయపాలెం, మల్కాపురం, నెక్కల్లు, శాఖమూరు, తుళ్లూరు, వెలగపూడి, మందడం, అనంతవరం, ఐనవోలు తదితర తదితర గ్రామాల్లో సంబంధిత రైతులు హాజరుకావాలని సూచించారు.

=====================